సాక్షి ఒడిశా

గురువారం । 2 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.10,94,074లు, బంగారం 300 మిల్లీగ్రాములు, వెండి 33 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వ్యవసాయ ప్రగతిపై దృష్టి సారించాలి

వ్యవసాయ ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి విజ్ఞప్తి చేశారు.

- 8లో

ముగ్గురికి డీజీపీ పదోన్నతి

భువనేశ్వర్: రాష్ట్రంలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు పోలీసు డైరెక్టర్ జనరల్ స్థాయి పదోన్నతి లభించింది. ఇటీవల 8 మంది ఐపీఎస్ అధికారులకు పలు హోదాల్లో పదోన్నతి కల్పించిన విషయం విదితమే. తాజా పదోన్నతి ఉత్తర్వుల ప్రకారం 1993 బ్యాచ్‌కు చెందిన అధికారులు వినయతోష్ మిశ్రా, ఆర్.పి.కోచే, సుశాంత కుమార్ నాథ్ డీజీపీ స్థాయి పదోన్నతి సాధించారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది

న్యూస్‌రీల్

రేపు కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం

- నేడు రాష్ట్రానికి రాక



డాక్టరు కంభంపాటి హరిబాబు

భువనేశ్వర్: రాష్ట్ర నూతన గవర్నర్‌గా డాక్టర్ కంభంపాటి హరిబాబు ఈ నెల మూడో తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన గురువారం భువనేశ్వర్ చేరుకుని పూరీలోని జగన్నాథస్వామివారి దర్శించుకుంటారు. భారత రాష్ట్రపతి ఆమోదం మేరకు రఘుబర్ దాస్ స్థానంలో మిజోరాం గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హరిబాబు రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. కొత్త గవర్నర్ ఇంజినీర్, అధ్యాపకునిగా విశేష గుర్తింపు సాధించి రాజకీయాల్లో అనుభవజ్ఞునిగా పేరొందారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా 24 సంవత్సరాల అనుభవం సాధించారు. 2023 అక్టోబర్ 18న రఘుబర్ దాస్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. పదవీ కాలానికి ముందే ఆయన రాజీనామా చేయడంతో భారత రాష్ట్రపతి ఆమోదంతో కొత్త గవర్నరు నియమితులయ్యారు.

పశువైద్యశాలలకు మందుల సరఫరా



వీటీ ఆగ్రహారం పశు సంవర్థక శాఖ కార్యాలయం నుంచి పశు వైద్యశాలలకు మందులు సరఫరా చేస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ప్రాంతీయ, గ్రామీణ, సంచార పశువైద్యశాలల్లో మందుల కొరతతో మూగ జీవాల వైద్యానికి ప్రైవేటు వెటర్నరీ మెడికల్ షాపుల్లో రైతులు మందులు కొనుగోలు చేస్తున్నారన్న అంశంపై గత నెల 30న 'మూగజీవాల వైద్యానికి మందుల్లేవ్' అనే శీర్షిక 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పశు సంవర్థక శాఖ అధికారులు స్పందించారు. పశువైద్యశాలలకు మందులు సరఫరా చేశారు.

ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి

- రైతుసంఘ నాయకులు

భామిని: మండలంలోని వడ్డంగి వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, మండల అధ్యక్షుడు బోగాపురపు అప్పలనాయుడు, కార్యదర్శి భూపతి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో ఎండిపోయిన చెరువులను స్థానిక రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కరువు రైతులపై దృష్టి సారించాలని సూచించారు. గతంలో 2019 ఎన్నికల ముందు టీడీపీ నాయకులు హుటాహుటిన కాట్రగడ–బి వద్ద ఎత్తిపోతల పథకానికి శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు అధికారంలో ఉన్న నేపథ్యంలో పథకం పూర్తి చేయాలని కోరారు. సాగునీరందక పంటలు పాడవుతున్నాయని, పాలకులు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బోదెపు రఘుపతినాయుడు, బోదెపు శేషగిరి, నీటి సంఘ అధ్యక్షుడు బోదెపు సుధాకర్, ఉపాధ్యక్షుడు గార మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

నూతనోత్సాహం

- ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు
- ఆటపాటలతో సందడి చేసిన యువత
- అధికారులు, ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ



రాయగడ: శంకేసు పిక్నిక్ స్పాట్ వద్ద రద్దీ

రాయగడ:

నూతన సంవత్సర వేడుకలను రాష్ట్ర ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ బుధవారం కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పుర వీధుల్లో యువత సందడి చేశారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారురు. పిక్నిక్ స్పాట్‌లు జనాలతో కిక్కిరిసి కనిపించాయి. రాయగడలోని హలువ, శంకేసు, తొలొగుమ్మ వంటి పిక్నిక్ స్పాట్‌లు రద్దీగా మారాయి. కుటుంబాలతో సహా వచ్చి సంతోషంగా గడిపారు.

మొక్కలతో శుభాకాంక్షలు..

జయపురం: కొత్త సంవత్సరాన్ని కొంతమంది వినూత్నంగా జరుపుకొన్నారు. గ్రీటింగ్ కార్డులు, మిఠాయిలు, బహుమతులకు బదులుగా జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ ఆదర్శ విద్యాలయంలో 8వ తరగతి విద్యార్థిని కృతిసాయిణి దొల బెహరా మొక్కలు బహుమతిగా ఇస్తూ నూతన సంవత శుభాకాంక్షలు తెలియజేసి ఆకట్టుకుంది. బొయిపరిగుడ సహిద్ లక్ష్మణ నాయిక్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయగా విద్యార్థిని అధ్యాపక సిబ్బంది మొక్కలు బహూకరించింది. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. తండ్రి, రామగిరి పంచాయతీ భల్లుగుడ ప్రాథమిక విద్యాలయం ఉపాధ్యాయుడు కనూచరణ బెహరా ప్రోత్సాహంతో వీటిని పంపిణీ చేసినట్లు విద్యార్థిని తెలిపింది. కార్యక్రమంలో సమితి సురక్ష అధికారి కార్తీక పాఢీ, కళాశాల అధ్యక్షులు స్నేహలత పట్నాయిక్, అధ్యాపకులు మానసీ ఆచార్య, కళాశాల చరిత్ర విభాగ అధ్యాపకులు హిమాంశు శేఖర బక్షీ, ఆంగ్ల విభాగ అధ్యాపకులు జ్యోతి పాఢీ తదితరులు పాల్గొన్నారు.

బొకేలకు గిరాకీ..

జయపురం: నూతన సంవత్సరం సందర్భంగా మార్కెట్‌లో బొకేలకు గిరాకీ ఏర్పడింది. పెద్ద ఎత్తున పూల అమ్మకాలు కొనసాగాయి. రాయపూర్, రాజమండ్రి నుంచి భారీగా పూలను తీసుకొచ్చి అమ్మకాలు సాగించినట్లు వ్యాపారులు వెల్లడించారు.



రాయగడ: ఇంటి ముందు ముగ్గులతో స్వాగతం

క్యాలెండర్ల ఆవిష్కరణ..

జయపురం: స్థానిక హనుమాన్ మందిర ప్రాంగణంలో మాధ్యమిక పాఠశాల ఉద్యోగుల సంఘం నేతలు నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ముందుగా హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. అనంతరం మాధ్యమిక పాఠశాలల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణదాస్ హనుమాన్ క్యాలెండర్లను ఉద్యోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సలహాదారు బృందావన పండా, సుజాత మహాపాత్రో, కిశోర్ చంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవితలు

జయపురం: జయపురం సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక లోకేశ్వరి ఉద్యాన ప్రాంతంలో ప్రత్యేక సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025కి స్వాగతం పలుకుతూ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'సాహిత్యంలో కవితలు, గల్పికలు' అనే అంశంపై జరిగిన కార్యక్రమం అలరించింది. వినూత్నంగా సాగిన ఈ కార్యక్రమానికి ముందుగా కరసుధా పట్నాయక్, సాహితీ పరిషత్ మాజీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ దాస్‌లు అగ్గిమంట వేసి పూజలు చేశారు. అనంతరం బహిరంగ స్థలంలో నిర్వహించబడిన కార్యక్రమంలో భాగంగా అగ్ని మంటలు వాటి ఉష్ణోగ్రతలపై కవులు, కవియిత్రులు కవితలను, యువ కళాకారుడు రామ నిగమ్ అందించిన శ్రావ్య సంగీతంతో తమతమ స్వీయ కవితలు వినిపించారు. అలాగే చలి, నూతన సంవత్సరం, ప్రకృతిపైన కూడా పలువురు తమ స్వీయ కవితలను చదవగా, కొంతమంది రచయితలు వ్యంగ కవితలను వినిపించారు. అనంతరం ఉత్తమ కవితలపై సమీక్షించారు. వృద్ధులు, మహిళలు, యువతులు, ఔత్సాహిక బాలికలు, యువతి యువ రచయితలు ఉత్సాహంగా కవితలను వినిపించారు. పరిషత్ కార్యదర్శి నిరంజన్ పాణిగ్రాహి నూతన సంవత్సరంలో సాహితీ పరిషత్ కార్యక్రమాలను వివరిస్తూ, పిల్లల్లో కవితా స్ఫూర్తిని కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. అధ్యక్షులు హరిహర కరసుధా పట్నాయక్ మాట్లాడుతూ.. రానున్న పర్వ సందర్భంగా చవితి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆ సందర్భంగా 'కవితా వినయ' అనే కార్యక్రమం నిర్వహిస్తామని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు. కార్యదర్శి పాణిగ్రాహం సభకు ధన్యవాదాలు తెలియజేశారు.



కవిత చదువుతున్న మహిళ రచయిత్రి



హాస్య కవితను వినిపిస్తున్న కవి



గల్పికను వినిపిస్తున్న ఔత్సాహిక బాలిక



రాయగడ: పిక్నిక్ స్పాట్‌ల వద్ద మహిళల సందడి



జయపురంలో బొకేలు విక్రయిస్తున్న దృశ్యం



జయపురం: మొక్కలు బహూకరిస్తున్న విద్యార్థిని కృతిసాయిణి



జయపురం: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

రోడ్డు భద్రతా వారోత్సవాల చైతన్య శకటం ప్రారంభం



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: జనవరి ఒకటి నుంచి ఏడో తేదీ వరకూ గజపతి జిల్లాలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ చెప్పారు. రోడ్డు భద్రతా వారోత్సవాల చైతన్య రథాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ రథం జిల్లాలోని అన్ని సమితి కేంద్రాల్లో రోడ్డు భద్రతపై ప్రజలకు చైతన్య పరుస్తోందన్నారు. దీనితో పాటు జాతీయ రోడ్డు భద్రతా ఛాయాచిత్రాలు కూడా అనేక చోట్ల ప్రదర్శిస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసన్న కుమార్ దాస్ అన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నివారిస్తామని, సీటు బెల్టుపెట్టుకోని వాహనదారులకు జరిమానా విధిస్తామని జిల్లా రవాణా శాఖ సూపరింటెండెంటు తుషార్ హేంబ్రమ్ అన్నారు. కార్యక్రమంలో సీడీఎంవో డాక్టర్ ఎం.ముబారక్ ఆలీ, ఏడీఎం రాజేంద్ర మింజ్ ఉన్నారు.

రాయగడలో..

రాయగడ: జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రచార రథాన్ని కలెక్టర్ ఫరూల్ పట్వారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా వారం పాటు జరిగే భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలన్నారు. అత్యధిక శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టకపోవడం దారుణమన్నారు. ఆర్‌టీఓ శివశంకర్ చౌదరి మాట్లాడుతూ ప్రతీ కూడలిలోనూ వాహన తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి

కలెక్టర్‌కు ఉద్యోగవర్గాల శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులతో కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో కలెక్టర్ క్యాంపు ఆఫీసుకు చేరుకొని శుభాకాంక్షలు చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్‌కు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పలువురు జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది శుభాంక్షలు తెలిపారు.

పార్టీ కార్యాలయాల్లో 'నూతన' సందడి



ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహిని కలుసుకున్న దివ్యాంగులు



బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ శ్రేణులు

పర్లాకిమిడి: స్థానిక బీజేడీ, బీజేపీ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఆంగ్ల సంవంత్సరం ప్రారంభం సందర్భంగా స్థానిక రాంనగర్ హైటెక్ ప్లాజాలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహికి బీజేడీ పార్టీ శ్రేణులు బసంత్ దాస్, రాష్ట్ర బీజేడీ సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, కాశీనగర్ ఎన్‌ఏసీ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, గుసాని సమితి అధ్యక్షులు ఎన్.వీర్రాజు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఇరదల వీధిలో బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు కోడూరు నారాయణరావుకు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవంత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.

అధికారులు సమష్టిగా పని చేయాలి

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ



సమావేశంలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు

భువనేశ్వర్: కొత్త సంవత్సరం ఆరంభం నుంచి ప్రభుత్వ అధికారులంతా సమష్టి బాధ్యతతో పని చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పిలుపునిచ్చారు. ఆంగ్ల సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని సీనియర్ ప్రభుత్వ ఉన్నతాధికారులతో స్థానిక లోక్ సేవా భవనంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. అయితే భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి, అకాల వర్షాలతో పంటలు నష్టం బారిన పడి రైతాంగం వాపోతున్న విచారకర పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి నూతన సంవత్సర వేడుకలను నివారించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు వాస్తవ కార్యాచరణకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. పాలన పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇదే దృక్పథంతో ప్రభుత్వ కార్యాచరణ నిరవధికంగా కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం చాలా వరకు నెరవేర్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. అధికారుల సహకారంతో జాతీయ స్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. ఈ కార్యాచరణతో ఇతర రాష్ట్రాల కంటే ఒడిశా చాలా మెరుగ్గా రాణిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది సత్ఫలితాలు సాధించాలన్నారు. సవాళ్లను సైతం సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకు సాగాల్సి ఉందన్నారు. సమష్టి బాధ్యతతో అన్ని సవాళ్లను ఎదుర్కొని విజయవంతంగా లక్ష్యం సాధించాలన్నారు. ఇటీవల ముగిసిన నేవీ డే, డీజీపీ కాన్ఫరెన్స్ తదితర జాతీయ స్థాయి కార్యక్రమాలు విజయవంతం కావడం ప్రేరణగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇదే తరహాలో ప్రవాసీ భారతీయ దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠతను బలపరిచేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్‌దేవ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఒడిశాకు ప్రగతి సంవత్సరంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ శతాబ్ది 2036, స్వతంత్ర భారత్ శతాబ్ది 2047 రెండు అంచెల వికాస కార్యాచరణలన్నారు. ఈ దిశలో సంకల్ప సాధన కోసం ముఖ్యమంత్రి మార్గదర్శకంలో అంతా సమష్టిగా పనిచేయాలని అధికారుల్ని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధన దిశలో అధికారులు సమర్థవంతంగా కృషి చేస్తున్నారని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహూజా ప్రకటించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రంలోని అధికారులు, ఉద్యోగులంతా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు నిబద్ధతతో పనిచేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి అదనపు ముఖ్య కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీలు హాజరయ్యారు.

పూరీలో తొక్కిసలాట





భారీగా బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్లో) తోపులాటలో భక్తులు

భువనేశ్వర్ : నూతన సంవత్సరం తొలి రోజున పూరీ జగన్నాథుని దర్శనానికి భక్తులు భారీగా పోటెత్తడంతో తోపులాటకు దారితీసింది. రద్దీని నియంత్రించడంలో అధికారులు విఫలం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వరుస క్రమంలో భక్తులకు దర్శనం కల్పించేందుకు శ్రీమందిరం సింహద్వారం నుంచి సుమారు అర కిలోమీటరు దూరం మార్కెట్ కూడలి వరకు తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ హద్దు ఆవలి నుంచి భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. దర్శనం కోసం సుదీర్ఘంగా నిరీక్షించాల్సి రావడంతో సహనం కోల్పోయి బారికేడ్ల హద్దుని అధిగమించి శ్రీమందిరం లోనికి ప్రవేశించేందుకు విఫలయత్నం చేశారు. దీంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. కొత్త సంవత్సరాది ముందు రోజున జరిగిన తోపులాటలో 10 మంది పైబడి భక్తులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక చిన్నబజార్ జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని 4వ తరగతి చదువుతున్న బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శంబానవీధి జంక్షన్ వద్ద ఎలక్ట్రికల్ షాపు నడుపుతున్న పురోషిత్ జితేంద్ర తన పెద్ద కుమారుడు పురోహిత్ అంకిత్‌తో కలిసి రోడ్డు దాటుతుండగా, ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు అతివేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బాలుడు అంకిత్ తలకి తీవ్రగాయాలయ్యాయి. దీంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేడుకల్లో యువకుడికి గాయాలు

సోంపేట: పట్టణంలోని కొత్తపేట పరిధిలో మంగళవారం రాత్రి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో కొత్తపేటకు చెందిన యువకుడు ఉమా బెహరాకు తీవ్రగాయాలయ్యాయి. బాణసంచా పేలడంతో చేతికి తీవ్రగాయమైంది. సోంపేట సామాజిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించినట్లు కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపారు.

వరికుప్పలు దగ్ధం



దగ్ధమైన వరికుప్పలు పరిశీలిస్తున్న వీఆర్వో మురళీ తదితరులు

పాతపట్నం: మండలంలోని బడ్డుమర్రి గ్రామానికి దూరంగా ఉన్న పంటపొలాల్లో కె.జోగారావు, పి.సీతారామన్న అనే రైతులకు చెందిన నాలుగు ఎకరాల వరికుప్పలు దగ్ధమయ్యాయి. అయితే వీటికి కావాలనే ఎవరో నిప్పు అంటించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీర్వో మురళీకృష్ణంనాయుడు దగ్ధమైన వరికుప్పలను పరిశీలించి, నివేదికను తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

విగ్రహం ధ్వంసం



ఆలయం ముందు ధ్వంసమైన సింహం విగ్రహం

పొందూరు: మండలంలోని కనిమెట్ట శివాలయం ముందున్న సింహం విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. మద్యం మత్తులో ఈ దుశ్చర్య జరిగి ఉండొచ్చనని అనుమానిస్తున్నారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి ఆలయం ముందు ఉన్న సింహం విగ్రహం ధ్వంసమైనట్లు గుర్తించారు. ఈ ఆలయానికి మండలంలోనే అత్యంత పురాతన శివాలయంగా గుర్తింపు ఉంది. విగ్రహం ధ్వంసంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ ప్రగతిపై దృష్టిసారించాలి

- జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి



విత్తనాలు, మందులు అందుకున్న రైతులు

జయపురం: వ్యవసాయ ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలని జయపురం ఎమ్మెల్యే తీరాప్రసాద్ బాహిణీపతి విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా జయపురం సమితి బొడొజివుని గ్రామంలో జయపురం సమగ్ర ఆదివాసీ అభివృద్ధి సంస్థ నిర్వహించిన ముఖ్యమంత్రి జనజాతి జీవిక మిషన్ కార్యక్రమంలో వ్యవసాయం, ఉద్యాన వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, సేంద్రీయ ఎరువులు, క్రింసంహారక మందుల వితరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని.. వారి సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. జనజాతి జీవిక మిషన్ మంచిదేనని.. అయితే ఆ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసి ఫలితాలు ఆదివాసీ ప్రజల చెంతకు చేరేలా చూడాలన్నారు. జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ జీవన జీవిక బీఎల్ఈ అభయంతి సాహు జనజాతి జీవిక మిషన్ కార్యక్రమాలను వివరించారు. వ్యవసాయ విభాగ అధికారి సౌమ్యరంజన్ సాహు, బొడొజివుని గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ పార్వతీ హరిజన్ పాల్గొన్నారు. నాయకగుడ, పుషపురు, ధరణహండి గ్రామాలకు చెందిన 45 మంది రైతులకు విత్తనాలు, క్రిమిసంహారక మందులు, సేంద్రియ ఎరువులను అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి



హాజరైన ప్రజలు



పురుగుమందుల కిట్లను అందుకుంటున్న మహిళా రైతు

దుర్గంధం



ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పారిశుద్ధ్య లోపంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. కార్తీక మాసం అనంతరం శ్రీముఖలింగం ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో దుర్గంధం వెదజల్లుతోందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ వెనుక భాగంలో చెత్త, వ్యర్థాలు కుప్పలుగా వేయడంతో వంశధార నదికి స్నానానికి వెళ్లేవారు సైతం అటువైపు నుంచి వెళ్లలేక ముక్కు మూసుకుంటున్నారు. అధికారులు స్పందించి చెత్త, వ్యర్థాలు తొలగించాలని కోరుతున్నారు.

– జలుమూరు

రైళ్ల నంబర్లు మార్పు



కాశీబుగ్గ: నూతన సంవత్సరం సందర్భంగా మారుతున్న క్యాలెండర్ ఇయర్‌లో రైల్వే వ్యవస్థలో పలు మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది టైం టేబుల్ మారనప్పటికీ, రైళ్ల నంబర్లు మార్పు చేశారు.

ట్రెయిన్ పేరు	పాత నంబర్	కొత్త నంబర్
విశాఖపట్నం–పలాస పాసింజర్	07470	67289
పలాస–విశాఖపట్నం పాసింజర్	07471	677290
భువనేశ్వర్– పలాస మెమో పాసింజర్	08443	68419
పలాస – భువనేశ్వర్ మెమో పాసింజర్	08444	68420
కటక్ – గుణుపూర్ మెమో పాసింజర్	08421	68433
గుణుపూర్ – కటక్ మెమో పాసింజర్	08422	68434
పలాస – కటక్ మెమో పాసింజర్	08534	68446
కటక్ – పలాస మెమో పాసింజర్	08533	68445
విశాఖపట్నం – బ్రహ్మపూర్ పాసింజర్	08532	58532
బ్రహ్మపూర్ – విశాఖపట్నం పాసింజర్	08531	58531
విశాఖపట్నం – గుణుపూర్ పాసింజర్	08522	58506
గుణుపూర్ – విశాఖపట్నం పాసింజర్	08503	58503

అవుట్ సోర్సింగ్..!

- జీఆర్‌ఏయూలో 34 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు
- ఏడాది కావడంతో ఏజెన్సీ రెన్యూవల్‌కు నిరాకరణ
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు



రిజిస్ట్రార్ సుజాత కారు ఆపి గోడు వినిపిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు(ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ అధికారులు మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వారు పనిచేస్తున్న విభాగాలు నుంచి ఫోన్లు చేసి విధులకు హాజరు కావద్దని సమాచారం ఇచ్చారు. వీరు అధికారులను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ఈ విషయంపై కారుపై వెళ్తున్న రిజిస్ట్రార్ సుజాతను ప్రశ్నించగా మాట్లాడేందుకు ఆమె నిరాకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాయంలో గత వీసీ నిమ్మ వెంకటరావు 2024 జనవరి ఒకటో తేదీన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారు. ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ సంస్థ ఏజీఎస్ మేనేజ్‌మెంట్ (గుంటూరు జిల్లా తాడేపల్లి)తో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిలో భాగంగా 12 మందికి గతంలో వర్సిటీలో పనిచేస్తూ మృతి చెందిన కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారు. విద్యార్హత ఆధారంగా క్లర్కెల్ అసిస్టెంట్లు మూడు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఆరు, డ్రైవర్లు రెండు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ మూడు, స్టోర్ కీపర్ ఒకటి, సూపర్‌వైజర్ ఒకటి, కేర్ టేకర్ ఒకటి, ఆఫీస్ సబార్డినేట్లు ఏడు, సెక్యూరిటీ గార్డులు ఐదు, ల్యాబ్ అటెండెంట్లు ఐదు పోస్టులు నియమించారు. కేటగిరి బట్టి రూ.16,461, రూ.12,000 వేతనాలు అందజేశారు.

ఒత్తిళ్లకు తలొగ్గి..

కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా అధికారులు వారి ఒత్తిళ్లకు తలొగ్గి 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపుపై దృష్టిపెట్టారు. ఈ మేరకు పక్క నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే లేఖ ఆధారంగా తొలగింపునకు కమిటీ వేశారు. ఈ కమిటీ నియామక ధ్రువీకరణ పత్రాలు తీసుకునేందుకు వర్సిటీ రెగ్యులర్ బోధకులు ముందుకు రాలేదు. దీంతో ఆగస్టు 22న అధికారులు తమ అధికారాలతో తొలగించాలని చూశారు. కానీ అప్పట్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. వేతనాలు కూడా చెల్లించలేదు. లేబర్ కమిషన్‌కు ఉద్యోగులు ఫిర్యాదు చేయడంతో సెప్టెంబర్‌లో ఆరు నెలలు, డిసెంబర్‌లో ఐదు నెలల వేతనాలు చెల్లించారు. అయినప్పటికీ ఇంకా ఒక నెల వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ లోపే తొలగింపు చర్యలు తీసుకున్నారు. చట్టపరంగా తొలగించే అవకాశాలను అన్వేషించిన అధికారులు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని ఏడాది తర్వాత రెన్యూవల్ చేయలేదు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నా, మెయిల్ చేసినా అధికారులు స్పందించ లేదు. మరోపక్క రాజకీయ సిఫార్సులతో తమకు నచ్చినవారిని నియమిస్తూ ముందుకు సాగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులు ఇద్దరు ఇంజినీర్లు, ముగ్గురు డ్రైవర్లు, నలుగురు విశ్రాంతి ఉద్యోగులు, ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు, అవసరం మేరకు సబ్జెక్టు కాంట్రాక్టర్లను నియమించుకున్నారు. భవిష్యత్తులో కూటమి నాయకుల సిఫార్సులు ఆధారంగా నియామకాలు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రాష్ట్రంలో 17 మంది వీసీలు రాజీనామా చేశారు.

ఇక్కడి అధికారులపై సైతం రాజీనామాలకు తీవ్ర ఒత్తిడి వచ్చినా, పదవులు కాపాడుకునే క్రమంలో కూటమి నాయకులను ప్రసన్నం చేసేందుకు పాకులాడుతున్నారు. వ్యక్తిగత ప్రయోజనానే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇది ధర్మం కాదు



అరకొర వేతనంతో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం ధర్మం కాదు. ఈ ఉద్యోగాలపై మా కుటుంబాలు ఆధారపడ్డాయి. వీధినపడ్డ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. ఔట్ సోర్సింగ్ సంస్థను రెన్యూవల్ చేయాలి. మా బతుకులు రోడ్డున పడేయడం న్యాయం కాదు.

– ఎ.లక్ష్మి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, బీఆర్‌ఏయూ

కోడళ్లపై కత్తితో మామ దాడి

- ముగ్గురికి గాయాలు

జి.సిగడాం: కోడళ్లపై కత్తితో మామ దాడి చేసిన ఘటన నడిమివలస గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నడిమివలస గ్రామానికి చెందిన పిన్నింటి సత్యనారాయణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ముగ్గరికీ ఆస్తి పంపకాలు చేశారు. కుమార్తె తన తండ్రి చెంతనే నివాసముంటూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో తండ్రికి చెందిన పొలం కుమార్తెకు దాఖలు పరిచారు. దీనిపై కొడుకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారిమధ్య తరుచుగా కుటుంబ తగాదాలు జరుగుతూ ఉన్నాయి. కాగా పొలంలో సాగు చేసిన పెసర పంటను తీసేందుకు బుధవారం పొలంకు కోడళ్లు వసంత, లక్ష్మి వెళ్లారు. అంతలోనే మామ సత్యనారాయణ, కుమార్తె పొలానికి చేరుకున్నారు. ఈ భూమి తన కుమార్తెకు ఇచ్చానని, దీనిపై కుమారులకు హక్కు లేదని కోడళ్లతో సత్యనారాయణ వాదించారు. అనంతరం కోడళ్ల కంట్లో కారం చల్లారు. అంతటితో ఆగకుండా కోడళ్లపై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో కోడలు వసంత తలకు, మరో కోడలు లక్ష్మి చేతికి, శరీరంపై గాయాలయ్యాయి. తగాదాను విడిపించేందుకు పక్కపొలంలో ఉన్న బంధువులు వెళ్లగా వారిలో బాలి సావిత్రమ్మ అనే మహిళకు సైతం గాయాలయ్యాయి. ఘటన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హుటాహుటిన పొలానికి చేరుకున్నారు. గాయపడిన ముగ్గరు మహిళలను రాజాం సామాజిక అస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.మధుసూదన రావు తెలిపారు.



గాయాలపాలైన లక్ష్మి



తలకు గాయమైన వసంత



గాయపడిన బంధువు సావిత్రమ్మ



- వ్యర్థానికి కొత్త అర్థం

ఏ వస్తువూ వృథా కాదు.. డిస్పోజల్స్ సైతం ఉపయోగించవచ్చు అని కార్పొరేషన్ అధికారులు నిరూపించారు. నగరంలోని కొన్ని పార్కుల్లో ఇటువంటి సరికొత్త డిజైన్లు పెట్టి చూపరులను ఆకట్టుకునేందుకు కార్పొరేషన్ కార్యాలయంలోనే వృథా వాటర్ బాటిల్స్‌తో కొత్త కొత్త డిజైన్లు తయారు చేశారు. పార్కులో పెట్టేందుకు ఓ కాంట్రాక్టర్‌కి డైరెక్షన్ ఇచ్చి గొడుగు ఆకృతి, డస్ట్‌బిన్లు తయారు చేసి ఉంచారు. పూర్తి స్థాయిలో ఇవి సిద్ధమయ్యాక పార్కుల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

జీతాలకు మోక్షమెన్నడో?



- ఈడీఎంలకు అందని వేతనాలు
- 13 నెలలుగా ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ విభాగంలో కంప్యూటర్ డేటా కార్యకలాపాలు చేసే సిబ్బంది ఈ–డివిజనల్ మేనేజర్ల(ఈడీఎం)కు 13 నెలలుగా జీతాలు అందడం లేదు. ఈ విషయంపై సీసీఎల్ఏ (రాష్ట్ర భూ పరిపాలనా విభాగం), రాష్ట్ర రెవెన్యూ, ఆర్థిక మంత్రుల చుట్టూ తిరిగినా జీతాల విడుదలకు కావాల్సిన ప్రొసీడింగ్స్ విడుదల చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 53 డివిజన్లలో ఈ–డివిజనల్ మేనేజర్లు ఉన్నారు. వీరంతా కాంట్రాక్టు విధానంలో అన్ని అర్హతల మేరకు 1998 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కాంట్రాక్టు విధానంలో నెలకు రూ.36,000లు వేతనం అందజేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వీరి జీతాలను రూ.36 వేలు నుంచి రూ.60 వేలుకు పెంచుతూ జీవో విడుదల చేశారు. అప్పుడే ఈ జీతాలకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఆర్థికపరమైన అంశాలు, సీసీఎల్ఏ క్లియరెన్స్ జరిగే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన ప్రక్రియ నిలిచి పోయింది. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఈడీఎం జీవో అమలు పక్కన పెట్టారు. జీతాలు కూడా విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నారు.

ఒక్కోచోట ఒక్కోలా


- ఈడీఎంల జీతాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా 53 రెవెన్యూ డివిజన్లలో ఒకేలా లేదు. రాష్ట్రంలో 15 రెవెన్యూ డివిజన్లు రాజమండ్రి, ఎట్టపాక, తెనాలి, గుంటూరు, ఒంగోలు, కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్, కొండూరు, కావలి, గూడూరు, అత్మకూరు, నాయుడుపేట, విశాఖపట్నం, అనకాపల్లి, పాడేరు, నర్సీపట్నం డివిజన్లలో నెలకు రూ.60,000 వంతున పొందుతున్నారు.
- 19 రెవెన్యూ డివిజన్లు పెనుకొండ, ధర్మవరం, కల్యాణ గూడెం, కదిరి, అనంతపురం, తిరుపతి, మదనపల్లి, చిత్తూరు, సీసీఎల్ఏ కార్యాలయం, నంద్యాల, కర్నూలు, కొవ్వూరు, కూకునూరు, నర్సాపురం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, రాజంపేట, జలమ్మలమడుగు, కడపలో పాత జీతాలు నెలకు రూ.36,000 అందిస్తున్నారు.
- 6 రెవెన్యూ డివిజన్లు పెద్దాపురం, పాలకొండ, శ్రీకాకుళం, టెక్కలి, విజయనగరం, పార్వతీపురంలలో పెంచిన జీతాలు ఒక నెల మాత్రమే చెల్లించారు. తర్వాత నుంచి ఒక్క నెల కూడా జీతం చెల్లించలేదు.
- 10 రెవెన్యూ డివిజన్లు కాకినాడ, అమలాపురం, రామచంద్రాపురం, నరసన్నపేట, గురజాల, బందరు, గుడివాడ, విజయవాడ, నూజివీడు, నెల్లూరులో కొత్త, పాత జీతాలు రెండింటిలో ఏ జీతం కూడా 13 నెలలుగా చెల్లించడం లేదు. దీంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు వీరికి ఇటీవల పనిభారం పెంచారు. ఒకవైపు వేతనాలు అందక, మరోవైపు పనిభారంతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. భూ పరిపాలనా విభాగం (సీసీఎల్ఏ) కమిషనర్ వద్ద ఎన్నిసార్లు జీతాల కోసం విన్నవించినా మంత్రి వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందని దాటవేస్తున్నారని, రెవెన్యూ మంత్రిని కలిస్తే ఆర్థిక మంత్రి వద్ద ఫైల్ ఉందని దాట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సామాన్యులకే చట్టాలా..!

చట్టాలను అమలు చేయాల్సినవారే వాటిని అతిక్రమిస్తున్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించాల్సివారే భద్రతను గాలికొదిలేస్తున్నారు. దీంతో అది చూసిన సామాన్యులు చట్టాలు మాకే వర్తిస్తాయా అంటూ ప్రశ్నిస్తున్నారు. బుధవారం పోలాకి మండలంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే పోలాకి–నరసన్నపేట రహదారిపై ఒక కానిస్టేబుల్ ఇలా హెల్మెట్ లేకుండా, అందులోనూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ వెళ్లారు. దీంతో పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

– పోలాకి



ఉపాధి నిధులతో పశుగ్రాసం సాగు

- శతశాతం సబ్సిడీతో సాగుకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు అర్హులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాతపట్నం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శతశాతం సబ్సిడీతో బహు వార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ మంచు కరుణాకర రావు తెలిపారు. రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగు చేసుకోవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో పశుగ్రాసాల సాగుకు సంబంధించి యంత్రాంగం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నిబంధనల మేరకు జాబ్ కార్డు ఉండి, ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతో పాటు సన్న, చిన్నకారు రైతులు బహువార్షిక పశుగ్రాసాల సాగుకు అర్హులు. ఈ క్రమంలో జీవాల పోషణ, పాడిరంగం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని శ్రీకాకుళం జిల్లాలో 1,000 ఎకరాల వరకు పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో 600 ఎకరాల్లో పశుగ్రాసం సాగులో ఉంది.

శతశాతం రాయితీ

10 సెంట్లలో పశుగ్రాసం సాగు చేసేందుకు మొత్తం ఖర్చు రూ.6,599 అవుతుంది. ఇందులో లేబర్ కాంపొనెంట్ కింద రూ.3 వేలు, మెటీరియల్ కాంపొనెంట్ (విత్తనం ధర, ఇతర ఖర్చులు) కింద రూ.3,599 చెల్లిస్తారు. 20 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.6 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.7,197 (మొత్తం రూ.13,197), 30 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.9 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.10,795 (మొత్తం రూ.19,795), 40 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.12 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.14394 (మొత్తం రూ.26,394), 50 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.15 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.17,992 (మొత్తం రూ.32,992) ఉపాధి నిధుల నుంచి చెల్లిస్తారని ఏడీ వివరించారు.

రైతులు సంప్రదించాలి

ఆసక్తి ఉన్న రైతులు తమ దరఖాస్తుతో పాటు ఉపాధి జాబ్‌కార్డు, భూమికి సంబంధించిన 1–బీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం, రేషన్ కార్డు నకలు సమర్పించాల్సి ఉంటుంది. దీనికోసం రైతులు తమ గ్రామాలకు సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి.

సూపర్ నేపియర్ అనుకూలం

బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సూపర్ నేపియర్ రకం ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుకూలం. బహువార్షిక రకాల్లో ఇది ముఖ్యమైనది. ఈ పశుగ్రాసం అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. సారవంతమైన నేలల్లో అధిక దిగుబడి వస్తుంది. సూపర్ నేపియర్ రకాన్ని అన్ని కాలాల్లోనూ సాగు చేయవచ్చు. 50 సెంట్ల భూమిలో ఏడాదికి 100 టన్నుల వరకు పశుగ్రాసం దిగుబడి వస్తుంది. ఈ తరహా పశుగ్రాసాలు ఒక్కసారి సాగుచేసుకుంటే కొన్నేళ్ల పాటు దిగుబడి వస్తుంది. రైతులు నీటి సదుపాయం కల్పించాల్సి ఉంటుంది.

– డాక్టర్ మంచు కరుణకరరావు, సహాయ సంచాలకుడు, పశుసంవర్ధకశాఖ, పాతపట్నం

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు బుధవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నూతన సంవత్సరం కావడంతో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశిష్ట కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎస్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

బంగారు అభరణాలు స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్సై నారాయణరావు

గుర్ల: మండలంలోని పెనుబర్తికి చెందిన సుంకరి రాము ఇంట్లో సోమవారం దొంగతనం జరిగింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై నారాయణ రావు దొంగతనంపై పూర్తి విచారణ చేసి నిందితుడిని పట్టుకుని బుధవారం అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వ్యక్తి దగ్గర నుంచి మూడుంపావు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రెండు రోజుల్లో కేసు విచారణ పూర్తి చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంతో ఎస్సై నారాయణ రావు, పోలీస్‌సిబ్బందిని సీఐ శంకరరావు అభినందించారు.

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రేపు



డీఈఓ ఎస్.తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: ఈనెల 3వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) జిల్లా కేంద్రంలోని డీవీఎంఎం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుపతి నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లావ్యాప్తంగా ఉన్న 15 మండలాల నుంచి ఎంపికైన దాదాపు 45 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇందులో సైన్స్ క్విజ్ పోటీలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో సరికొత్త విద్యా, వైజ్ఞానిక అంశాలను ప్రదర్శించేందుకు సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ కోరారు.

లారీ ఢీకొని సైక్లిస్ట్ మృతి



లక్ష్మునాయుడు మృతదేహం

గజపతినగరం: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద లారీ ఢీకొట్టిన సంఘటనలో ఓవ్యక్తి మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గజపతినగరం మండలం గంగచోళ్ల పెంట గ్రామానికి చెందిన పెయింటర్ కనకల లక్ష్మునాయుడు (44) సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లీల, డిగ్రీ చదువుతున్న కుమారుడు చాణక్య ఉన్నారు. సమాచారం మేరకు స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళిక పారాలి..
ఫలితాలు రావాలి

- గత రెండేళ్లుగా పదోతరగతి ఫలితాల్లో మన్యం ముందంజ
- ఈ ఏడాది గురుకుల పాఠశాల గురువుల సమ్మెతో పూర్తికాని సిలబస్
- ఆందోళనలో విద్యార్థిలోకం
- శతశాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ దిశానిర్దేశం



వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్టడీ అవర్స్‌లో పదోతరగతి విద్యార్థులు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా గత రెండేళ్లు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. ఏప్రిల్–2023 టెన్త్ ఫలితాల్లో 87.47 శాతం, ఏప్రిల్–2024 టెన్త్ ఫలితాల్లో 96.37 శాతంతో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ముచ్చటగా మూడోసారి మార్చి 2025లో జరగనున్న టెన్త్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించాలని జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే, ఓ వైపు గత 40 రోజులుగా పైగా జిల్లాలోని గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టడం, గిరిజన గురుకులాల్లో టెన్త్ క్లాస్ సిలబస్ పూర్తికాకపోవడం ప్రతిబంధకాలుగా కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ విద్యపై టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడం, విద్యార్థులకు కావాల్సిన వసతులు సమకూర్చకపోవడం ఫలితాలపై పడే సూచనలు కనిపిస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది. కలెక్టర్ శ్యామప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఉపాధ్యాయుల కృషి కలిసొచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి.

దిశానిర్దేశం ఇలా..

గత రెండేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఇటీవల వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. సబ్జెక్టు టీచర్లు, విద్యాశాఖ అధికారులకు ఈ ప్లాన్ వివరించారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి జరగనున్న పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టులలో సందేహాలను నివృత్తిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాయనున్న 10,802 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా బోధన సాగించాలని దిశానిర్దేశం చేశారు. ఇది రెండు నెలలపాటు పక్కాగా అమలైతే చక్కని ఫలితాలు వచ్చే అవకాశం ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం



గత రెండేళ్లలో సాధించిన టెన్త్ ఫలితాలను పునరావృతం చేసేందుకు ప్రస్తుతం టెన్త్ విద్యార్థులకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధంచేశాం. ప్రతిరోజు స్లిప్ టెస్టుల నిర్వహణ, వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల బోధన, ఆదివారం కూడా సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

– ఎస్.తిరుపతినాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి, పార్వతీపురం మన్యం

విద్యుత్ వైర్లపై పవళించిన మందుబాబు..!



ఎం.సింగుపురంలో మద్యం కిక్కుతో విద్యుత్ వైర్లపై పడుకున్న వ్యక్తి

విచ్చల విడిగా మద్యం ఏరులై పారుతుండడంతో కిక్కు తలకెక్కిన మందుబాబుల విన్యాసాలు విడ్డూరంగా ఉంటున్నాయి. పాలకొండ మండలంలోని ఎం.సింగుపురం గ్రామానికి చెందిన ఓ మందుబాబు పూటుగా మందు తాగి ఏకంగా విద్యుత్ స్తంభం ఎక్కేందుకు ప్రయత్నించాడు. అది గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి సమీపంలో ఉన్న నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా క్షణాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అప్పటికే సదరు వ్యక్తి పూర్తిగా స్తంభం ఎక్కి విద్యుత్ వైర్లపై పడుకుని హడావిడి సృష్టించాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు నచ్చజెప్పి సురక్షితంగా మందుబాబును కిందికి దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈఘటనపై 100కు సమాచారం అందడంతో ఎస్సై కె.ప్రయోగమూర్తి సూచనలతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే సమస్య పరిష్కారం కావడంతో సదరు వ్యక్తిని పోలీసులు మందలించారు.

-పాలకొండ రూరల్

నిరాశ్రయులకు తోడుగా 'మానవీయత'



నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం బయట నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న సీఐ శంకరరావు, గోవిందరాజులు

- చలిలో వణుకుతున్న అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

చీపురుపల్లి: ఇళ్లల్లో ఉంటూ చలికి వణుకుతూ ఉన్న ప్రస్తుత రోజుల్లో ఏ తోడు నీడ లేక బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆలయాల బయిట చలిలో వణుకుతూ ఉన్న నిరాశ్రయులకు తోడు ఎవరు? అలాంటి వారి కోసమే పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తోంది. చలిలో వణుకుతూ నిద్రిస్తున్న నిరాశ్రయులకు 25 ఏళ్లుగా దుప్పట్లు కప్పుతూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా నిరాశ్రయులకు అండగా నిలిచింది మానవీయత సంస్థ. మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం, ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఆరుబయట చలిలో వణుకుతూ నిద్రిస్తున్న 50 మంది నిరాశ్రయులకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శంకరరావు, మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ.గోవిందరాజులు దుప్పట్లు కప్పి వారికి చలి నుంచి రక్షణ కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శంకరరావు మాట్లాడుతూ మానవీయత సంస్థ ఆధ్వర్యంలో చక్కని సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏ ఆధారం లేక చలిలో వణుకుతున్న నిరాశ్రయులకు దుప్పట్లు అందించడం చాలా అవసరమన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం చాలా గొప్ప విషయమని అభినందించారు.

ఉద్యోగాల్లో కొనసాగించాలి

- మహిళల ఆందోళన

తగరపువలస: విజయనగరం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 170 మంది మహిళలు బుధవారం ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం స్ప్రింట్ సీ ఫుడ్స్ సంస్థ ముందు ఆందోళన చేపట్టారు. పదేళ్ల నుంచి పనిచేస్తున్న తమను అకారణంగా ఉద్యోగాల నుంచి తొలగించారని వారు ఆరోపించారు. నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో మాట్లాడేందుకు మహిళలు ప్రయత్నం చేయగా.. సిబ్బంది అనుమతించలేదు. దీంతో గేటు ముందు బైఠాయించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఆనందపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను మాట్లాడించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది.

ప్రశాంతంగా ముగిసిన నూతన సంవత్సర వేడుకలు

- ఎస్పీ వకుల్ జిందల్



మయూరి జంక్షన్ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత వాహన తనిఖీలు చేపడుతున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసుశాఖ జిల్లావ్యాప్తంగా చేపట్టిన ముందస్తు చర్యలు సత్ఫలితాలిచ్చాయని, నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిసేందుకు సంబంధిత పోలీసు అధికారులు జిల్లావ్యాప్తంగా ముఖ్యమైన కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటుచేయడంతో పాటు, వాహన తనిఖీలు చేపట్టారన్నారు. రాత్రి ఒంట గంట తర్వాత రహదారులపై ఎవరూ సంచరించకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేసి, రహదారులపై సంచరించే యువతను ఇళ్లకు తరలించామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపైన, మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపైన విస్తృతంగా దాడులు నిర్వహించి, కేసులు నమోదుచేశామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 42 కేసులు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ఐదు కేసులు నమోదుచేయడంతో పాటు, ఎంవి.చట్టం అతిక్రమించిన వారిపై 184 కేసులను నమోదుచేశామని తెలిపారు. గుర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో దత్త ఎస్టేట్‌లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో రైడ్ చేసి 32 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 22 మొబైల్ ఫోన్‌లు, నాలుగు కార్లు, 10 మోటారు సైకిళ్లు, రూ. లక్ష 82 వేల 740 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా ముగిసేందుకు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన భద్రత ఏర్పాట్లను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు. సంబంధిత సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారని వివరించారు.

32మంది జూదరుల అరెస్ట్

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్దనున్న దత్త ఎస్టేట్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 32 మంది జూదరులను అరెస్ట్ చేసి నట్లు ఎస్సై నారాయణ రావు బుధవారం తెలిపారు. జూదరుల దగ్గర నుంచి రూ.లక్ష 82వేల 740 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో డిసెంబర్ 29న నిర్వహించిన కంది కొత్తల ఉత్సవంలో ప్రమాదవశాత్తు సాంబారు అండాలో పడి తీవ్రంగా కాలిన గాయాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న చెముడు గూడ గ్రామానికి చెందిన ఎన్.రమేష్ (30) బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా ప్రస్తుతం భార్య గర్భిణి. వద్ధాప్యంలో తల్లిదండ్రులు ఉన్నారు. రమేష్ ఒడిశాకు చెందిన ప్రైవేట్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అన్నీ తానై కుటుంబాన్ని పోషించే రమేష్ మృతి చెందడం పట్ల కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఫ్లెక్సీల చించివేత



కురుపాం మండల కేంద్రంలో చించివేతకు గురైన ఫ్లెక్సీలు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని కురుపాం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. దీనిపై పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఫ్లెక్సీలు చించివేయడం పిరికి పంద చర్యగా పేర్కొన్నాయి. ఇలాంటి సంస్కృతి కొనసాగితే సహించేది లేదని హెచ్చరించాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ



విజయనగరం పూల్‌బాగ్: క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న బాబ్జీ,తదితరులు

విజయనగరం అర్బన్: ఏపీఎన్‌జీఓ జిల్లా కమిటీ రూపొందించిన 2025 వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బుధవారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడం గొప్ప విషయం..

విజయనగరం పూల్‌బాగ్: హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాల అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం పెద్ద చెరువు గట్టున విజయసాగర దుర్గా మల్లేశ్వరి అమ్మవారి ఆలయం నిర్మించి, పేదలకు నిత్యాన్నదానం చెయ్యడం గొప్ప విషయమని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా భీశెట్టి దంపతులను హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ సభ్యులు ఆశీర్వదించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు దవడ కొండబాబు, అధ్యక్షురాలు మీనా నాయక్, కార్యదర్శి స్రవంతి నాయక్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: ఏపీఎన్‌జీఓ జిల్లా కమిటీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

రోడ్డు ప్రమాదంలో తోడల్లుళ్ల మృతి

- మరో మహిళ పరిస్థితి విషమం
- మార్టూరు జాతీయ రహదారిపై ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన రాము, గోపిలు



అపస్మారక స్థితికి చేరుకున్న రాము భార్య ఉమ



భర్త, బావల మరణంతో తల్లడిల్లుతున్న గోపి భార్య నాగలక్ష్మి

మార్టూరు: నూతన ఏడాది అంతా బాగా జరగాలని తమకు కలిసి వచ్చిన చర్చికి వెళ్తుండగా లారీ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. దీంతో తోడల్లుళ్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని తాతపూడి, డేగరమూడి గ్రామాల మధ్య రహదారిపై సోమవారం జరిగింది. ఈ ఘటనపై మార్టూరు ఏఎస్సై మహబూబ్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన పల్లపు గోపి (29), విజయనగరం జిల్లాకు చెందిన నాగలక్ష్మిని ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నాగలక్ష్మి అక్క ఉమకు పదేళ్ల క్రితం విజయనగరం జిల్లా బాడంగి మండలం పి. వెంకంపేట గ్రామానికి చెందిన కొల్లు రాము (32)తో వివాహం అయ్యింది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అక్కాచెల్లెళ్ల కుటుంబాలు కొన్నేళ్లుగా విజయవాడలోని వాంబే కాలనీలో నివాసం ఉంటూ గ్రానైట్ సంబంధిత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

కలిసి వచ్చిన చర్చికి వెళ్తూ ప్రమాదం

మృతుడు పల్లపు గోపి మార్టూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో అతనికి గతంలో అద్దంకి మండలం రెడ్డిపాలెం గ్రామంలోని చర్చికి ప్రార్థనల నిమిత్తం వెళ్లే అలవాటు ఉంది. ఈ క్రమంలో నూతన సంవత్సర వేళ ప్రార్థనల కోసం మొత్తం ఎనిమిది మంది బంధువులు కలిసి నాలుగు బైక్‌లపై విజయవాడ నుంచి రెడ్డిపాలెం చర్చికి బయలుదేరారు. ఒక బైక్‌పై రాము అతని భార్య ఉమ, తోడల్లుడు గోపి వెళ్తున్నారు. మరో బైక్‌పై గోపి భార్య నాగలక్ష్మి తన తమ్ముడితో ప్రయాణిస్తోంది. ఈక్రమంలో తాతపూడి, డేగరమూడి గ్రామాల మధ్య రహదారిపై ముందు వెళ్తున్న లారీని దాటే క్రమంలో రాము బైక్‌తో ప్రమాదవశాత్తు లారీ కింద పడిపోయాడు. ప్రమాద తీవ్రతకు రాము తలపగిలి మెదడు రహదారిపై చెల్లాచెదురుగా పడడంతో వాతావరణం అంతా భీతావహంగా మారింది. గోపి సైతం తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తల పగిలి ముక్కు చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం అవుతూ ఫిట్స్‌తో ఉన్న రాము భార్య ఉమను స్థానికుల సమాచారంతో చిలకలూరిపేట 108 సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆమెను అదే వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న మార్టూరు ఏఎస్సై, సిబ్బంది కోటేశ్వరరావు, రాజేష్‌లతో కలిసి ప్రమాదస్థలానికి చేరుకున్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం హైవే సిబ్బంది సహాయంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుడు గోపి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పైసలు కొట్టు.. విద్యుత్ మీటరు పట్టు..!

- అడిగినంత ఇస్తే ఓకే..లేదంటే చుక్కలు చూపిస్తున్న విద్యుత్ అధికారులు
- విద్యుత్ కనెక్షన్ మంజూరుకు అధిక మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు
- కేటగిరిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు



విద్యుత్ భవన్

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన డి.ఈశ్వరమ్మ అనే మహిళ కొద్ది రోజుల క్రితం తన ఇంటికి విద్యుత్ మీటర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అప్లికేషన్ పట్టుకుని మీటరు కోసం విద్యుత్‌శాఖ కార్యాలయానికి వెళ్తే వారు మీటర్ ఇవ్వాలంటే కొంత ఇవ్వాలని సిబ్బంది డిమాండ్ చేశారు. అడిగినంత ఇవ్వలేదని ఆమెకు మీటర్ ఇవ్వలేదు.

- పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో ఉన్న ఓ లేవుట్‌లో ఇల్లు నిర్మిస్తున్న ఓ వ్యక్తికి 11కేవీ లైన్ వేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి రూ.లక్షలు తీసుకుని కనెక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇలా వీరిద్దరే వద్దే కాదు. అనేక మంది దగ్గర నుంచి విద్యుత్‌శాఖ సిబ్బంది అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగినంత ఇచ్చినట్లయితే ఓకే..లేదంటే విద్యుత్ శాఖ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పెట్టే ముప్పుతిప్పలు తట్టుకోలేక వినియోగదారులు వారు అడిగినంత ముట్టజెప్పుతున్నారు. కింది స్థాయి సిబ్బంది దగ్గర నుంచి అధికారుల వరకు అందరూ పైసలు ఇస్తేగాని పనిచేయడం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

కేటగిరిని బట్టి రేటు

విద్యుత్ కనెక్షన్ కేటగిరిని బట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. కేటగిరి–1 గృహ వినియోగదారులకు అయితే కనెక్షన్ ఇవ్వడానికి రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా వాణిజ్య విభాగాల కేటగిరి–2కు అయితే రూ.10 వేల నుంచి రూ.20 వేలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అయితే రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు, పెద్ద పరిశ్రమలకు అయితే రూ.5 లక్షలు వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా లేఅవుట్‌లు, అపార్ట్‌మెంట్‌లకు కూడా రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

పైసలు ఇవ్వనిదే పనిజరగదనే ఆరోపణలు

విద్యుత్‌శాఖలో చిన్నపాటి పనికి అయినా పైసలు ఇవ్వనిదే పని జరగదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ పోల్స్ మార్చడానికి, విద్యుత్ లైన్ వేయడానికి, విద్యుత్ వైర్లు మార్పు చేయడానికి, కొత్త కనెక్షన్ల మంజూరుకు ఇలా ఏ పనికి అయినా పైసలు ఇస్తేగాని పని చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ నిత్యావసర వస్తువు మాదిరి మారడంతో వినియోగదారుల అవసరాలను ఆ శాఖ సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారు.

డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయవచ్చు

విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లయితే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లయితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. కనెక్షన్ మంజూరులో అలసత్వం వహించిన వారిపై విచారణ వేసి చర్యలు తీసుకుంటాం.

మువ్వల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్